క్లుప్తంగా

ఈఓగా సుబ్బారావు



ఎంపీడీఓకు నియామక ఉత్తర్వును అందజేస్తున్న ఈఓ

రుద్రవరం: మేజర్ పంచాయతీ అయిన రుద్రవరం ఈఓగా సుబ్బారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లలో విధులు నిర్వహిస్తున్న ఆయనను ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన తన నియామక పత్రాన్ని ఎంపీడీఓ రామచంద్రకు అందజేసి విధుల్లో చేరారు.

గోస్పాడు ఎస్ఐగా నాగార్జున రెడ్డి



గోస్పాడు: ఎస్ఐగా నాగార్జునరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ మల్లికార్జునను నంద్యాల రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో నంద్యాల రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్ఐ నాగార్జునరెడ్డిని ఇక్కడి బదిలీ చేయడంతో విధుల్లో చేరారు.

కుల గణన 95 శాతం పూర్తి

ఉయ్యాలవాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే మండలంలో ఇప్పటి వరకు 95 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో సర్వే తీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో 9,570 కుటుంబాలు ఉండగా 8,943 కుటుంబాల్లోని 23,209 మంది సభ్యుల కులగణన నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెలాఖరు నాటికి వంద శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

పిల్లలందరూ బడిలోనే ఉండాలి

చాగలమర్రి: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని మిషన్ వంద శాతం జీఈఆర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ముత్యాలపాడులోని బర్న్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మజరా గ్రామమైన చక్రవర్తులపల్లెలో ర్యాలీ నిర్వహించారు. సర్వశిక్ష అభియాన్‌లో భాగంగా విద్యార్థులు విద్య మా హక్కు, అందరూ చదవాలి-అందరూ ఎదగాలి, పిల్లలు బడికి-పెద్దలు పనికి, బాలల చదువు భవితకు వెలుగు అనే నినాదాలతో గ్రామంలో పర్యటించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం బార్నబస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి



నర్సాపురం పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న శారదాబాయి

రుద్రవరం: కుష్టు, ఎయిడ్స్, క్షయ తదితర వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అధికారిణి శారదాబాయి తెలిపారు. మండలంలోని నర్సాపురం పీహెచ్‌సీని సోమవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీకి వచ్చే రోగులు,వారికి అందిస్తున్న వైద్య సేవలు, సర్వేల తీరుపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. బీసీజీ సర్వే త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పల్స్ పోలియో నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు పరిశీలించారు. వైద్యులు బాబు,సిబ్బంది ఉన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పోతురాజు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

శిరివెళ్ల: యర్రగుంట్లలో సోమవారం 45 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఆళ్లగడ్డ మండలం నల్లగట్లకు చెందిన నారాయణ తన స్వగ్రామానికి బాటిళ్లను తీసుకెళ్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

అర్హులందరికీ పథకాలు



ప్రచారం చేస్తున్న గంగుల అవంతిరెడ్డి

ఆళ్లగడ్డ: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకురాలు గంగుల అవంతిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 18, 11వ వార్డుల పరిధిలోని పలు కాలనీల్లో సోమవారం రాత్రి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్లు డాక్టర్ సుధామణి, రమీజాబీ, రమేష్, న్యాయవాది సరిత, నజీర్ ఉన్నారు.

వైద్య సేవలు మెరుగు

- నాడు – నేడు కింద పీహెచ్‌సీకి రూ.30 లక్షలు కేటాయింపు
- పెద్దయమ్మనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో వసతుల కల్పన
- కాన్పులు సైతం చేస్తున్న వైద్యులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి శివలింగమ్మ

ఉయ్యాలవాడ : వైఎస్సార్‌సీపీ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. పల్లె ముంగిట మెరుగైన వైద్యం అందజేయాలని నూతన పీహెచ్‌సీలతో పాటు వసతులు కల్పించింది. మండలంలోని పెద్దయమ్మనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ. 30 లక్షలు వ్యయం చేసి అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో సర్వాంగ సుందరంగా కార్పొరేట్‌కు ధీటుగా ముస్తాబైంది. అలాగే ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యులు గ్రామాలకు వెళ్లి నేరుగా వైద్య సేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు విజయదుర్గ, శివలింగమ్మ వైద్య సేవలందిస్తున్నారు. దీంతో ఆరోగ్య కేంద్రంలో సేవలు మెరుగుపడ్డాయి. ప్రస్తుతం ఆరోగ్య కేంద్రంలోనే ప్రసవాలు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 9 మందికి సాధారణ ప్రసవాలు చేశారు. ఆసుపత్రిలో పురుడు పోసుకున్న మహిళలకు ఆరోగ్య శ్రీ పథకం కింద రూ. 4 వేలు, జననీ సురక్ష యోజన కింద రూ.వెయ్యి ప్రభుత్వం అందజేసింది. ప్రభుత్వం కాన్పు అయిన నాటి నుంచి డిశ్చార్జ్ అయ్యేంత వరకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం పాలు, బ్రెడ్డు, రాత్రి భోజన వసతి కల్పిస్తుంది. అలాగే కాన్పు అయిన బాలింతలను తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా వారి నివాసం వున్న గ్రామంలోని ఇంటి వద్దకు సురక్షితంగా చేరుస్తుంది. ఆరోగ్య కేంద్రంలో రోజుకు 60 – 75 మందికి ఓపీ ద్వారా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నామని వైద్యాధికారిణి శివలింగమ్మ వివరించారు.

సంతోషంగా ఉంది



చిన్న చిన్న శస్త్ర చికిత్సల కోసం కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించి మాలాంటి మధ్య తరగతి కుటుంబాలు గత ప్రభుత్వంలో అప్పులు చేయవలసి వచ్చింది. ఇప్పుడు నయా పైసా ఖర్చు లేకుండా మా గ్రామంలోని ఆసుపత్రిలోనే అన్ని రకాల జబ్బులకు వైద్య సేవలు అందుతుండడం సంతోషంగా ఉంది.

– కౌసల్య, పెద్దయమ్మనూరు



పెద్దయమ్మనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

3న జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలు

నంద్యాల(అర్బన్): మార్చి 3వ తేదీన స్థానిక వివేకానంద ఆడిటోరియంలో 9వ జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు అంశంపై పోటీ ఉంటుందని పేర్కొన్నారు. పోటీకి 5 నిమిషాల ముందు ప్రొట్రాయిట్ చూసి వేయాలని సూచించారు. 8, 9, 10తరగతులకు సంబంధించి ఒకే పాఠశాల నుంచి ఎంత మంది విద్యార్థులు అయిన పాల్గొనవచ్చన్నారు. 1వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ : 9966639299 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇంటి పన్ను వసూలు చేయాలి

శిరివెళ్ల: 2023- 2024కు సంబంధించిన ఇంటి పన్నును త్వరగా వసూలు చేయాలని ఎంపీడీఓ ఫణి రాజకుమారి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో రూ. 49.60 లక్షలకు గాను ఇంత వరకు రూ. 21.55 లక్షలు వసూలైందన్నారు. మార్చి లోగా వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి విద్యుత్ బిల్లు బకాయిలు చెల్లించాలని చెప్పారు.

ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయండి



భూమి పూజల్లో పాల్గొన్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

రుద్రవరం: వేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయించాలని ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి ఆలయ ఈఓ వేణునాథరెడ్డికి సూచించారు. మండలంలోని బీరకటులులో రూ.50 లక్షలతో వేణుగోపాల స్వామి నూతన ఆలయ నిర్మాణ పనులకు ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డితో కలిసి సోమవారం భూమి పూజ చేశారు. దాదాపు 200 ఏళ్ల క్రితం గ్రామ శివారులోని పొలాల్లో ఉన్న ఆలయం కాలక్రమేణా శిథిలమైంది. నూతన ఆలయం నిర్మించాలని గ్రామస్తులు గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. సీజీఎఫ్ కింద గ్రామస్తులు తమ వాటాగా రూ.10 లక్షలు చెల్లించగా ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసింది. మొత్తం రూ.50 లక్షలతో ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. అనంతరం గ్రామస్తులు ఆయనను సత్కరించారు. గ్రామ సర్పంచు ఏలిషా, నాయకులు శేషు, రాజ్‌కుమార్, పుల్లారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, కోటకొండ సర్పంచ్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి పాములేటి,అర్చకుడు జయనరసింహ ఉన్నారు.

చెస్ విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో సోమవారం నెరవాటి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జిల్లా స్థాయి చెస్ పోటీల విజేతలకు ప్రముఖ ఎముకలు, కీళ్ల వ్యాధుల డాక్టర్ రాజశేఖర్ రెడ్డి సౌజన్యంతో పతకాలు, ట్రోఫీలు అందజేశారు. సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ రవికృష్ణ, రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మామిళ్ల యుగంధర్(ఆళ్లగడ్డ), అద్నాన్ అమీన్, హర్షవర్ధన్‌చారి, కాల్వ శ్రీనివాసులు, (నంద్యాల) వరుస స్థానాల్లో విజేతలుగా నిలిచారని చెప్పారు.

పల్స్ పోలియోను జయప్రదం చేయండి

చాగలమర్రి: మార్చి 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్న జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు షేక్ ఇమ్రాన్, అంజలి కోరారు. సోమవారం పీహెచ్‌సీలోని సమావేశ భవనంలో శిక్షణ, అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.వారు మాట్లాడుతూ 3 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో 32 బూత్‌ల ద్వారా ఐదేళ్ల లోపు ఉన్న 4,166 పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు 3 రూట్లుగా విభజించి, 132 మంది ఆశా, ఆరోగ్య, అంగన్‌వాడీ, స్వచ్ఛంద కార్యకర్తలను ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన రెండు రోజుల్లో ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన పిల్లలకు చుక్కలు వేస్తామని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ, హెల్త్ సూపర్‌వైజర్‌లు రామలింగారెడ్డి, సీతారాజులు,సీహెచ్ఓ రమణమ్మ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఫ్యాక్షన్ జోన్ సీఐ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా ఫ్యాక్షన్ జోన్ సీఐగా వంశీధర్ పదవీ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సోమవారం జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శిరివెళ్ల సీఐగా విధులు నిర్వహిస్తున్న వంశీధర్‌ను ఉన్నతాధికారులు ఫ్యాక్షన్‌జోన్ సీఐగా బదిలీ చేశారు.

ఓటమితో కుంగిపోవద్దు

శిరివెళ్ల: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమితో కుంగిపోవద్దని ఎంపీపీ నాయక్ వసీం పేర్కొన్నారు. సోమవారం తన సొంత ఖర్చులతో మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఏర్పాటు చేశారు. వాలీబాల్ సీనియర్ విభాగంలో యర్రగుంట్ల జట్టు విజయం సాధించగా రూ.5 వేలు, రన్నర్‌గా నిలిచిన శిరివెళ్ల జట్టుకు రూ. 3 వేలు, జూనియర్ విభాగంలో శిరివెళ్ల జటుగెలవగా రూ.2 వేలు అందజేశారు.

29న మున్సిపాలిటీ వేలాలు

ఆళ్లగడ్డ: ఈ నెల 29వ తేదీ మున్సిపాలిటీ వేలం పాటలు నిర్వహిస్తామని కమిషనర్ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. పట్టణ పరిధిలో వివిధ రకాల వ్యాపారాలకు ఈ నెల 28వ తేదీ వేలం నిర్వహించాలని తీర్మాణం చేసినప్పటికీ అనివార్య కారాణలతో 29వ తేదీకి మార్చామని చెప్పారు.

అద్దె బస్సులకు టెండర్ల ఆహ్వానం

నంద్యాల టౌన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ఆర్టీసీ డిపోల్లో 20 అద్దె బస్సుల కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి రజియా సుల్తానా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల డిపోలో 8 బస్సులు, ఆళ్లగడ్డ డిపోలో 4, బనగానపల్లె డిపోలో 3, ఆత్మకూరు, నందికొట్కూరు డిపోల్లో 2, కోవెలకుంట్ల డిపోలో 1 బస్సు కోసం మార్చి 6వ తేదీ లోపు టెండరు దాఖలు చేయవచ్చన్నారు. హెల్ప్ డెస్క్ 7969066600, 08912747053 నంబర్లను సంప్రదించాలని కోరారు.

స్పందన వినతులను వేగంగా పరిష్కరించండి



మహిళ సమస్యను వింటున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల: స్పందన వినతులను వేగంగా పరిష్కరించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమంలో డీఆర్ఓ పద్మజ ఇతర జిల్లాధికారులతో కలిసి జిల్లాలోని వివిధ నలమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీదారునికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కరించలేని సమస్యలకు సరైన రీతిలో ఎండార్స్‌మెంట్ ఇచ్చి అర్జీదారునికి అర్థమయ్యేలా వివరించాలన్నారు. స్పందన కార్యక్రమంలో 176 మంది అర్జీలు అందజేశారని, సత్వరమే ఆయా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు పంపామన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

నంద్యాల(అర్బన్): జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణ శివారులోని పీవీ నగర్ ఎంపీపీ స్కూల్ పోలింగ్ కేంద్రంతో పాటు పెద్దకొట్టాల, బిల్లలాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి, ఎంతఓ బ్రహ్మం నాయక్ తదితరులతో కలిసి పరిశీలించారు.

మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలి



వీసీలో పాల్గొన్న డీఆర్‌డీఏ అధికారులు, సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): మహిళా సంఘంలో ఉన్న మహిళలు రైతులుగా మారి ప్రకృతి వ్యవసాయం చేయాలని ఆర్‌వైఎస్ఎస్, ఏపీసీఎన్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, సెర్ప్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, మహిళలకు సూచించారు. సోమవారం స్థానిక డీఆర్‌డీఏ సమావేశ భవనంలో శ్రీనిధి సమన్వయ సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగింది. అధికారులు మాట్లాడుతూ భూమి లేని నిరుపేద మహిళలు భూమిని కౌలుకు తీసుకొని ప్రకృతి వ్యవసాయం చేయాలని తెలిపారు. నంద్యాల జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మార్తమ్మ , డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, డీపీఎం నరేంద్రారెడ్డి, దానం పాల్గొన్నారు.

బిషప్ ఎన్నికల బరిలో 9 మంది పాస్టర్లు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల డయాసిస్ అధ్యక్ష ఖండం పీఠాధిపతులు (బిషప్) ఎన్నికలకు ఈనెల 7 నుంచి 26వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. సోమవారం సాయంత్రం 5గంటలకు నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యిందని ఎన్నికల ఇన్‌చార్జి సాల్మన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసేందుకు డయాసిస్ పరిధిలోని 9 మంది పాస్టర్లు నామినేషన్ల దాఖలు చేశారు. వీరిలో రెవరెండ్లు కె.సంతోష్ ప్రసన్నరావు, నందం ఐజక్, సాల్మన్, డీజే సునిల్, అబ్రహాం ప్రేమ్‌చంద్, ఐజక్ ప్రసన్నకుమార్, కొత్తమాసి జోసెఫ్, కలబండి ఐజక్, పెద్దిటి ఇమ్మానియేల్‌లు బిషప్ బరిలో ఉన్నట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(అర్బన్): ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న సీఓ, ఏపీ, టీఏల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఆర్ఈజీఎస్ ఎంప్లాయిస్ సంఘం నంద్యాల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సుబ్బరాయుడు, సలావుద్దీన్ కోరారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

బీసీజీ సర్వే వేగవంతం చేయండి

శిరివెళ్ల: అడల్ట్ బీసీజీ సర్వేను వేగవంతం చేయాలని ఫ్యామిలీ డాక్టర్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జగదీశ్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేసి సర్వేపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల వయస్సు పైబడి క్షయ వ్యాధితో బాధపడుతున్న వారికి కొత్తగా బీసీజీ వ్యాక్సిన్ ఇస్తామన్నారు. వ్యాక్సిన్‌పై ప్రచారం చేస్తున్నామని, మార్చిలో వ్యాక్సినేషన్ మొదలవుతుందని తెలిపారు. అలాగే ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తామని చెప్పారు. మార్చి 3,4 తేదీల్లో జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. సీహెచ్ఓ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ వేలంతో ఆదాయం



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న డాక్టర్ అంకిరెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణంలోని పలు మున్సిపల్ దుకాణాలకు సోమవారం జరిగిన బహిరంగ వేలంతో మున్సిపాలిటీకి ఆదాయం వచ్చినట్లు మున్సిపల్ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ 20 దుకాణాలకు వేలం నిర్వహించామని, గతంలో వేలానికి రాని దుకాణాలకు నేడు గరిష్టధరకు అప్పగించామన్నారు. ఓల్డ్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో రూ.7వేల దుకాణాన్ని రూ.9వేలకు, ఎన్టీఆర్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 3దుకాణాలకు రూ.3వేల నుంచి రూ. 4,500 చొప్పున పెంచామన్నారు. బస్టాండ్ వద్ద ఉన్న రెండు దుకాణాలకు రూ.6,100 అద్దెకు వేలంలో దక్కించుకున్నారని చెప్పారు. ఇన్‌చార్జ్ ఆర్ఓ వెంకటకృష్ణ, ఆర్ఐ గులాం హుసేన్ ఉన్నారు.

నంద్యాలకు ఏం చేశారు ఫరూక్?



మాట్లాడుతున్న గౌస్

నంద్యాల(అర్బన్): 30ఏళ్ల రాజకీయంలో మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కుటుంబ సభ్యులు బాగుపడ్డారే తప్ప నంద్యాల మైనార్టీలకు ఏమి చేశారో చెప్పాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జీఎం గౌస్ ప్రశ్నించారు. ఐదుసార్లు మంత్రిగా, మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉండి నంద్యాల అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణంలోని కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. రాష్ట్రంలోని 175 శాసనసభ స్థానాల్లో ఒక్క స్థానాన్ని మాత్రమే చంద్రబాబునాయుడు మైనార్టీలకు కేటాయించారన్నారు. శిల్పా కుటుంబాన్ని విమర్శించే స్థాయి ఫరూక్‌కు, ఫిరోజ్‌కు లేదన్నారు. 1985లో తన తండ్రి మాబుపీరాకు ఇచ్చిన సీటును త్యాగం చేయడం వల్లే ఫరూక్‌కు అప్పట్లో టీడీపీ సీటు దక్కిందని గుర్తు చేశారు. మైనార్టీలంతా శిల్పా కుటుంబం వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారం చేపడుతుందన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

శిరివెళ్ల: మార్చి 1వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని యర్రగుంట్ల జీటీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. పరీక్షల డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా వెంకటేశ్వర్లు, చీఫ్ సూపరిండెంట్‌గా బాల చింతలయ్య నియమితులయ్యారని చెప్పారు. 1వ తేదీన ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయవుతాయని, 190 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. అలాగే 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ద్వితీయ సంవత్సరం పరీక్షలను 160 మంది విద్యార్థులు రాస్తారన్నారు. స్థానిక మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారన్నారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు ప్రతి గదిలో సీసీ కెమెరా ఏర్పాటు చేశామని చెప్పారు.

రుద్రవరంలో పార్వేట సందడి



శివాలయం వీధిలో పూజలందుకున్న ఉత్సవమూర్తులు

రుద్రవరం: మండల కేంద్రంలో పార్వేట సందడి నెలకొంది. ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరద స్వామి వారు పల్లకీలో కొలువు దీరి గ్రామంలోని పలు తెలువుల మీద ఆశీనులు గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం గ్రామంలోని సత్యనారాయణ స్వామి దేవాలయం తెలుపు మీద కొలువు దీరగా అక్కడ తెలుపు యజమానులు పుట్టాలమ్మ క్షేత్ర కమిటీ డైరెక్టర్ గంగిశెట్టి తిమ్మయ్య, ఆయన సోదరులు మద్దిలేటయ్య, రమేషయ్య కుటుంబ సభ్యులు స్వామి వారికి విశేష పూజలు చేశారు. అనంతరం పశు సంవర్ధక శాఖ సహాయకులు గిడ్డయ్య, డిప్యూటీ తహసీల్దారు రవీంద్రప్రసాదు, అమ్మవారిశాల సెంటర్‌లో అటవీ శాఖ వారి తెలుపు మీద రేంజర్ శ్రీపతినాయుడు, ఫారెస్టర్ నాగరాజు, సిబ్బంది పూజలు చేశారు. పల్లకీ రాకతో గ్రామంలోని లోగిళ్లు బంధువులు, స్నేహితులతో కళకలాడుతున్నాయి. ప్రధాన వీధుల్లో వివిధ రకాల దుకాణాలు వెలిశాయి.


అందుబాటులో సున్నా వడ్డీ అర్హుల జాబితా

దొర్నిపాడు: మండలంలోనిని అన్ని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో సున్నా వడ్డీ పంట రుణాల జాబితాను ప్రదర్శనకు ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి సునీత సోమవారం తెలిపారు. ఖరీఫ్ (2022), రబీ (2021–2022) కాలానికి సంబంధించిన సున్నా వడ్డీకి అర్హులైన రైతుల జాబితాను అందుబాటులో ఉంచామన్నారు. 2022 ఖరీఫ్‌లో 570 మంది రైతులకు రూ.12,12,727, 2021–2022 రబీలో 790 మంది రైతులకు రూ.8,60,738 నగదు నేరుగా ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు.

గ్రామాల వారీగా ఖరీఫ్ (2022), రబీ(2021-2022) సాగు వివరాలు..

గ్రామం	రైతులు (ఖరీఫ్-2022)	నగదు	రైతులు (రబీ2021-2022)	నగదు
అర్జునాపురం	34	59,033	55	45,302
బుర్రారెడ్డిపల్లె	34	70,932	30	22,569
చాకరాజువేముల	134	3,10,697	117	1,27,949
దొర్నిపాడు	117	2,57,718	148	1,60,618
గుండుపాపల	70	1,33,515	11	25,135
కొండాపురం	31	53,698	90	66,016
క్రిష్టిపాడు	15	37,835	67	69,330
రామచంద్రాపురం	84	1,48,156	173	1,38,444
డబ్ల్యూ గోవిందిన్నె	51	1,41,143	104	2,05,375
మొత్తం	570	12,12,727	795	8,60,738

సనాతన ధర్మం.. హిందూ ధర్మం



హిందూధర్మం గురించి వివరిస్తున్న శంకర విజయేంద్ర స్వామి

నంద్యాల(వ్యవసాయం): హిందూధర్మం సతానమైనదని, ఆచార వ్యవహారాల్లో గొప్పదని కంచి కామకోటి 70వ పీఠాధిపతి శ్రీజగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పేర్కొన్నారు. సోమవారం మహానంది నుంచి స్థానిక ప్రథమనంది దేవస్థానం గాయత్రీ దేవాలయంలో బ్రాహ్మణ సేవా సమాఖ్య ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్వామీజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందూ సంప్రదాయ, ఆచార వ్యవహారాలను పాటిస్తూ సమాజ, దేశాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. చిన్నతనం నుంచే విద్యార్థులు వేదాలు, ఉపనిషత్‌లతో పాటు ఆధునిక విద్యను కూడా అభ్యసించాలని పిలుపునిచ్చారు. ఆదిశంకరాచార్యుల తత్వాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. మార్చిలో ఒంగోలు జిల్లాలో సనాతన ధర్మ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేస్తున్నామని చెప్పారు. పురుషులు, స్త్రీలు ఇద్దరు సమానమని, ఎవరిని చిన్నచూపు చూడరాదని చెప్పారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణ గావించారు. సమాఖ్య అధ్యక్షుడు మురళీకృష్ణ, నగరడోన సుధీర్, రావినూతల దుర్గాప్రసాద్, రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): మాఘమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకొని శైవ క్షేత్రాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచి అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకాలు చేపట్టి స్వా వారికి నాగాభరణం అలంకరించారు. శ్రీప్రథమనంది దేవస్థానం, బ్రహ్మనందీశ్వరస్వామి , సోమనందీశ్వర, ఆంజనేయస్వామి ఆలయంలో నాగనందీశ్వర దేవాలయాల్లో మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు.